## క్లుప్తంగా

### వైభవంగా గంధోత్సవం



కార్వేటినగరం: మండల కేంద్రంలోని హజరత్ సయ్యద్‌షా సబ్దర్ అవులియా జవాలివారి గంధోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు మేళతాళాలు, బాణ సంచా పేలుళ్ల సందడి నడుమ ఫకీరుల విన్యాసాలతో అంగరంగ వైభవంగా గంధాన్ని ఊరేగించారు. అనంతరం దర్గకు చేరుకుని ఫాతెహా నిర్వహించారు. ఈ క్రమంలో భాగంగా దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంధం ఫాతెహాను తిలకించారు.

### తెల్లగుండ్లపల్లెకు విద్యుత్ సౌకర్యం



వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ తెల్లగుండ్లపల్లె గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ గోవిందయ్య తెలిపారు. గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గ్రామస్తులు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ట్రాన్స్‌కో ఏడీఈ, ఏఈలతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో స్తంభాలను నాటి వైర్లు లాగే పనులు ప్రారంభమైనట్లు సర్పంచ్ చెప్పారు. ఏ గ్రామానికైనా విద్యుత్ సౌకర్యం కావాలంటే తమను సంప్రదిస్తే డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లి వసతి కల్పిస్తామని తెలిపారు.

# వైభవం.. గోదా పరిణయోత్సవం





నింద్ర: ప్రత్యేక అలంకరణలో గోదాదేవి, రంగనాథస్వామి, పుత్తూరు ధర్మరాజస్వామి ఆలయంలో..

నగరి: నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ధనుర్మాసం ముగింపు సందర్భంగా శనివారం గోదాదేవి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నగరి పట్టణంలో టీటీడీ అనుబంధంలోని శ్రీకరియమాణిక్యస్వామి ఆలయంలో నెల రోజుల పాటు గోదాదేవి వ్రతం ఆచరిస్తూ.. తిరుప్పావై పఠించారు. శనివారం టీటీడీ నుంచి పండితుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. 500 మంది మహిళలు ఆంజనేయస్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, పండ్లు, పాలను, శివాలయం నుంచి పసుపును ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈ పూజల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం అమ్మవారి పసుపు, అక్షింతలను ప్రసాదంగా అందజేశారు. ఆలయ అధికారులు వెంకటరమణ, గుణశేఖర్, శివప్రసాద్ గురూజీ, శ్రీనివాసులు నాయుడు, ప్రధాన అర్చకులు రమేష్ ఆచార్యులు, ధన్వంతరి ఆచార్యులు, ఆలయ అభివృద్ధి సలహా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**పుత్తూరు పట్టణంలో..**

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీగోదాదేవి శ్రీరంగనాథ స్వామి కళ్యాణం శాస్త్రోక్తం జరిగింది. ఉదయం శ్రీగీతామందిర ఆశ్రమ పీఠాధిపతి శ్రీపుండరీక వరదానందస్వామి ఆధ్వర్యంలో సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్త సమూహం నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకుడు రాజేంద్రాచ్చారి పర్యవేక్షించారు. ఆగమ సలహాదారు రూపేష్‌స్వామి పాల్గొన్నారు. శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజస్వామి ఆలయంలో హిమాచలంబాబు, వనజ దంపతుల ఆధ్వర్యంలో శ్రీగోదాదేవి, శ్రీరంగనాథస్వామి కళ్యాణం వైభవంగా జరిగింది. అంతకు ముందు ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రముఖ శల్యవైద్యులు ఎస్.ప్రకాష్‌రాజు, జుగల్ కిషోర్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను దేవస్థానం చైర్మన్ లారీమోహన్ పర్యవేక్షించారు.

**నింద్ర వినాయక ఆలయంలో..**

నింద్ర: మండల కేంద్రంలోని శ్రీవినాయకస్వామి ఆలయంలో శ్రీగోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో నెల రోజులపాటు ధనుర్మాస పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం వినాయకస్వామికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కల్యాణోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేసి కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. పండరీ భజన బృందం ప్రదర్శనల నడుమ గోదారంగనాథస్వామి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు.



నగరి: కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

# సంతోషాలు వెల్లివిరియాలని..



పాలసముద్రం: గంగిరెద్దును మొక్కుకుంటున్న గ్రామస్తులు



నింద్రలో భోగిమంట



కార్వేటినగరం..



పాలసముద్రం: శ్రీకావేరిరాజుపురంలో భోగి సందడి

నగరి: తెలుగువారి లోగిళ్లలో కుటుంబ సభ్యులందరూ సంబరంగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి సంబరాలు శనివారం భోగితో ప్రారంభమయ్యాయి. పట్టణం, మండలంలో భోగి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. శనివారం వేకువజాము నుంచే చిన్న పిల్లలు భోగి మంటల చుట్టూ నిలబడి డప్పు వాయిస్తూ చిందులువేశారు. ఈప్రాంతంలో డప్పుకొడుతు చిన్నారులు 'భోగో భోగో' అంటూ వీధుల్లో తిరగుతూ సందడి చేయడం ఆనవాయితీ. గ్రామాల్లో భోగిమంటల్లోనే వేన్నీళ్ల కాచుకుని తలంటు స్నానం చేశారు. నూతన వస్త్రాలను ధరించి ఆలయాలకు వెళ్లారు. సంత సంక్రాంతి సామగ్రి విక్రయాలతో కళకళలాడింది. సంక్రాంతి రోజున పొంగళ్లు పెట్టడానికి కుండలు, పసుపుకొమ్ములు, చెరుకుగెడలు, పూజాసామగ్రి కొనుగోలుకు జనం ఆశక్తి చూపారు.

**గ్రామ దేవతలకు పొంగళ్లు**

గంగాధరనెల్లూరు: సంక్రాంతి వేడుకల్లో భాగంలో మొదటి రోజు భోగి పండుగను మండలంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే నిద్రలేచి ఇంటి ముంగిట భోగి మంట వేశారు. కష్టాలు తొలగి, సంతోషాలు వెల్లివిరియాలని ప్రార్థించారు. తలంటి స్నానమాచరించి నూతన వస్త్రాలు ధరించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అల్లిఎల్లమ్మ ఆలయంలో, ఎగవూరులోని శ్రీసత్యమ్మ దేవత ఆలయాల వద్ద గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్ళి అంబళ్ల పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఇళ్ల ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దారు.

**వెదురుకుప్పంలో..**

వెదురుకుప్పం: బొమ్మన్‌దొడ్ల, పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంట, దేవళంపేట గ్రామాల్లో పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పోటాపోటీగా ఇళ్ల ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని మాంబేడులో ఎడ్ల పందాలు హోరెత్తించాయి.

**కార్వేటినగరంలో..**

కార్వేటినగరం: మండలంలో భోగి పండుగను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. వేకువజాము 3గంటల నుంచే భోగి మంటలు వేశారు. కొత్త దుస్తులు ధరించి చిన్నారులు, మహిళలు ఆలయాలకు వెళ్లి పూజల్లో పాల్గొన్నారు.

**ఎస్సార్‌పురంలో..**

శ్రీరంగరాజపురం: మండలంలో భోగి పండగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మంటల్లో పాత వస్తువులను వేసి కష్టాలు తొలగించి, సంతోషాలను ప్రసాదించాలని ప్రార్థించారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తున్న వారు స్వగ్రామాలకు రావడంతో పల్లెల్లో సందడి కనిపించింది.

నింద్ర: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన వెంటనే భోగి మంటలు వేశారు. ఇళ్ల ముంగిట మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. నింద్ర బస్టాండ్ వద్ద యువకులు పెద్ద ఎత్తున భోగి మంట వేశారు.

పాలసముద్రం: మండలంలో గొబ్బిళ్లు, గంగిరెద్దుల ఆటలతో గ్రామాల్లో భోగి పండుగ సందడి మిన్నంటింది. ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దారు. గ్రామాల్లో హరిలో రంగహరీ అంటూ హరినామ కీర్తనలతో హరిదాసులు భిక్షకు వచ్చారు. గంగిరెద్దుల వారు బసవన్నతో విన్యాసాలు చేయించారు.

### ప్రవచకులకు సన్మానం



పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీద్రౌపదీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రవచకలు పళ్లిపట్టు పయణి, డాక్టర్ సి.గోవిందస్వామి, గురుప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు, ధనుర్మాసం ప్రారంభం నుంచి ప్రతిరోజూ వీరు చేసిన తిరుప్పావై, భగవద్గీత పారాయణం, సంకీర్తనల ఆలాపనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ధనుర్మాసం చివరి రోజు వారిని దేవస్థానం చైర్మన్ లారీమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



# తగ్గేదేలే..

సంక్రాంతి వేడుకల్లో భాగంగా వెదురుకుప్పం మండలం మాంబేడులో శనివారం ఎద్దుల పరుషా హోరెత్తించింది. రంకెలేస్తూ దూసుకొస్తున్న కోడెగిత్తలు..వాటిని కట్టడి చేసేందుకు పోటీ పడిన యువత కేరింతలతో పరుష దుమ్మురేపింది. ఎడ్ల వేగాన్ని నిలువరించి పలకలు పట్టి యువకులు ప్రతాపాన్ని చూపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన జనంతో గ్రామంలో సందడి నెలకొంది.

-వెదురుకుప్పం







# పుట్టా ఆరోపణలు అర్థరహితం

తిరుపతి కల్చరల్: వాస్తవాలకు విరుద్ధంగా టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డిపై పుట్టా సుధాకర్ యాదవ్ వ్యక్తిగత విమర్శలు చేయడం అర్థరహితమని టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సుబ్బారెడ్డి గురించి తెలిసిన వారె వరూ ఆయన్ను విమర్శించరని అందులో పేర్కొన్నారు. ఒంగోలు, అమ రావతి, హైదరాబాద్‌లోనున్న టీటీడీ చైర్మన్ ఇళ్ల వద్ద గోపూజ నిరంతరం కొనసాగుతోందని చెప్పారు. మరి పుట్టా సుధాకర్‌కు ఎన్ని గోవులు ఉన్నాయి, ఆయనకు గోపూజ అంటే ఏమిటో తెలుసా అని ప్రశ్నించారు.

### రేపు ముగ్గుల పోటీలు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వద్ద సోమవారం సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఎస్టీయూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు యూనియన్ మండల అధ్యక్షుడు కె.నాగేంద్రరాజు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సొలేషన్ బహుమతి ప్రదానం చేస్తామన్నారు.



# అయ్యప్ప దేవాయ నమః..

నగరి: పట్టణ పరిధి బైపాస్ సర్కిల్ సమీపంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో, శ్రీకరకంతేశ్వరస్వామి ఆలయ ప్రాకారంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో, సత్రవాడ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం మకర జ్యోతి పూజలు వైభవంగా జరిగాయి. ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. అయ్యప్ప స్వామి, విఘ్నేశ్వర, సుబ్రమణ్యస్వామి విగ్రహాలను, 18మెట్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అఖండ దీపం వెలిగించి పూజలు చేశారు. అఖండ దీపంతో ఆలయ ప్రాకారాలను ప్రదక్షిణ చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. అన్నదానం చేశారు. రాత్రి అయ్యప్ప, విఘ్నేశ్వర, సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తులను విద్యుద్దీపాలంకరణలు, బాణ సంచా పేలుళ్ల సందడి నడుమ పట్టణ పరిధిలో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.



కరకంతేశ్వర స్వామి ఆలయంలో విశేష అలంకరణ



బైపాస్ సర్కిల్ వద్ద అయ్యప్ప ఆలయంలో